**Publication: Prajashakti** **Date: Saturday, 27th September, 2014**

**Edition: Hyderabad**

# బీమాలో భారీ పెట్టుబడులు అవసరం

- ఆన్‌లైన్ పథకాలను ఆవిష్కరించాలి
- ఐఆర్‌డిఎ ఛైర్మన్ టిఎస్ విజయన్

**ప్రజాశక్తి-బిజినెస్ బ్యూరో**

బీమా రంగంలోకి భారీగా పెట్టుబడులు రావల్సిన అవసరముందని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఎ ఛైర్మన్ టిఎస్ విజయన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో అసోచామ్ ఏర్పాటు చేసిన బీమా డిజిటలైజేషన్ మరియు ఎఫ్‌డిఐ' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఈ రంగంలో 50,000 కోట్ల పెట్టుబడులు అవసరం ఉందన్నారు. కాగా తాము ఎఫ్‌డిఐ రావాలని కోరుకోవడం లేదని, అయితే భారత్‌లో ఇంత మొత్తంలో పెట్టుబడులకు అవకాశాలు లేవని పేర్కొన్నారు. దీంతో విదేశీ పెట్టుబడులను ఆశించాల్సి వస్తుందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత మాసంలోనే బీమా రంగంలోకి ఎఫ్‌డిఐ పరిమితిని 26 శాతం నుంచి 49 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బీమా కంపెనీలు ఆన్‌లైన్ పథకాలను ఆవిష్కరించాలని, వీటి విక్రయాలను పెంచాలని సూచించారు. దీంతో ఖాతాదార్లకు ఎక్కువ లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ పథకాలపై కంపెనీలు దృష్టి సారించాలని సూచించారు. మెజారిటీ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పథకాలను రూపొందించాలన్నారు. ఈ రంగంలో డిజిటలైజేషన్ మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటలైజేషన్‌తో కంపెనీలకు నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుందని, ఈ లాభాలను ఖాతాదార్లకు అందించాలని సూచించారు. డిజిటలైజేషన్ పైలట్ ప్రాజెక్టు కొనసాగుతుం దన్నారు. అన్ని బీమా సంస్థలకు ఐదు బీమా డిజిటలైజేషన్ సంస్థలను ఐఆర్‌డిఎ గుర్తించిందన్నారు. వీటికి 5,000 చొప్పున పాలసీలను డిజిటలైజేషన్‌కు గాను పైలట్ ప్రాజెక్టు అప్పజెప్పామన్నారు. ఈ నెల చివరి వరకు దీనికి ఓ రూపం వస్తుందన్నారు. దీంతో ఇందులో వచ్చిన సమస్యలను సమీక్షించి ముందుకు సాగాలని ఐఆర్‌డిఎ భావిస్తోందన్నారు. డిజిటలైజేషన్ అందుబాటులోకి వస్తే ఖాతాదార్లు ఎప్పుడైనా తమ బాండ్లను పోగొట్టుకున్న ఇందులో వారి పథకాల పూర్తి వివరాలు నిక్షిప్తం అయి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోచామ్ సెక్రటరీ జనరల్ డిఎస్ రవత్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి క్రిష్ణమూర్తి, కామ్స్ రెపిసిటోరీ సర్వీసెస్ నుంచి ఎస్‌వి రమణన్, జెబి బోడా ఇన్సూరెన్స్ బ్రోకర్ తపస్ నంది, అసోచామ్ జాయింట్ డైరెక్టర్ ఆర్‌కె భాసిన్, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సిఇఒ పి నందగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.